జయజయ శంకర

హరహర శంకర



శాంకర సంవత్సరం 2533

సంపుటి : 3 సంచిక : 3 & 4

# శ్రీ కామకోటి వాణి

శ్రీ క్రోధినామ పుష్య - మాఘ మాసం, జనవరి - ఫిబ్రవరి 2025



శ్రీ కంచికామకోటి పీఠం, కాంచీపురము



# వైభవంగా అఖిలాండేశ్వరి అమ్మవారి తాటంక ప్రతిష్ఠా మహోత్సవం



## శ్రీ చక్రాత్మక తాటంక పోషితాంబా మనోరథాయ నమః

**సుధామప్యాస్వాద్య ప్రతిభయజరామృత్యుహరిణీం విపద్యంతే విశ్వే విధిశతమఖాద్యా దివిషదః**
**కారాలం యత్క్ష్వేళం కవళితవతః కాలకలనా న శంభోస్తన్మూలం తవ జనని తాటంక మహిమా**

**యజ్ఞే యజ్ఞఫలప్రదే యమనుతే యజ్ఞేశ్వరారాధితే యక్ష్మఘ్నే యమసూదనప్రియతమే యజ్ఞేశసంపూజితే**
**యంత్రస్థే యతిపూజితే యతికృతశ్రీచక్రభూషోజ్జ్వలే యక్షిణ్యాదిసమస్తశక్తివినుతే వందే అఖిలాండేశ్వరి**

సముద్ర మథనం చేస్తున్నప్పుడు వచ్చిన హాలాహలాన్ని చూసి దేవతలు, రాక్షసులు అక్కడి నుంచి పలాయనం చిత్తగించినప్పుడు పరమశివుడు దానిని సేవించిన కథ మనకు తెలిసిందే. కానీ, అంతటి కాలకూట విషాన్ని పరమశివుడు సేవించిన తర్వాత కూడా ఆయన అలాగే ఉండటానికి అఖిలాండేశ్వరి అమ్మవారి తాటంకాల మహిమే కారణమని శ్రీశంకర భగవత్పాదాచుర్యలు తన సౌందర్యలహరిలో కీర్తించారు. ఇంతటి మహిమాన్వితమైన తాటంకాలను ధరించిన ఆ అఖిలాండేశ్వరి ఈ భూలోకంపైనే కొలువై ఉన్నదని మనలో చాలామందికి తెలియదు. పంచభూత క్షేత్రాలలో ఒకటైన జంబుకేశ్వరంలో ఆమె పరమశివునితో కలిసి కొలువై ఉన్నారు.



గొప్ప యతీంద్రులైన శ్రీమత్ ఆదిశంకర భగవత్పాదాచార్యులు శ్రీచక్ర ప్రతిష్ఠ గావించిన తాటంక కర్ణ ఆభూషణములతో జాజ్వల్యమానంగా వెలుగుతున్న అఖిలాండేశ్వరి అమ్మవారు మానవ పూజలను అందుకుంటూ గజారణ్య క్షేత్రములో వెలిసి ఉన్నారు.

అంతటి మహిమాన్వితమైన ఆ తల్లి తాటంకాలకు జీర్ణోద్ధరణ జరగడం ఒక పండుగ. అసలు ఈ అఖిలాండేశ్వరి భూమిపైకి ఎలా వచ్చింది, ఈ తాటంకాలు ఏమిటి, వాటి జీర్ణోద్ధరణ ఏమిటి, దానిని ఎవరు నిర్వహిస్తారు అనే విషయాలను వివరించడమే ఈ వ్యాసం ఉద్దేశ్యం.

## ప్రాచుర్యంలో ఉన్న ఆలయ చరిత్ర

పంచభూత క్షేత్రాలలో ఒకటి అయిన తిరువనైకోయిల్ ఆలయంలో నెలవై ఉన్న అఖిలాండేశ్వరి అమ్మవారు అఖిలాండనాయకిగా అంటే ఈ విశ్వాన్నే పరిపాలించే అధిదేవతగా ప్రసిద్ధి చెందారు. ఆలయ చరిత్ర ప్రకారం, లోకక్షేమం కోసం పరమశివుడు చేసే తపస్సును పరిహించినందుకు పార్వతీ దేవిని భూలోకంలో తపస్సు చేయవలసిందిగా ఆదేశించారుట. ఆయన ఆదేశం మేరకు పార్వతీ దేవి ఇక్కడ గల నాటి జంబూక మహర్షి పేరిట ఏర్పడిన జంబుకారణ్యంలో అంటే నేటి తిరువానైకోవిల్‌లో తపస్సు చేయాలని నిర్ణయించుకుని, కావేరీ నది జలాలతో ఒక లింగాన్ని తయారు చేసి, తన తపస్సును ప్రారంభించింది. ఆ రకంగా నీటితో చేసిన లింగమే అప్పు లింగంగా ప్రసిద్ధి చెందింది.

ఆ రకంగా తపస్సు చేసిన అఖిలాండేశ్వరికి పరమశివుడు ప్రత్యక్షమై ఆమెకు శివ జ్ఞానాన్ని బోధించారుట. పడమర దిక్కుగా నిలిచిన పరమశివుడికి తూర్పుముఖంగా నిలిచి అఖిలాండేశ్వరి ఉపదేశాన్ని పొందిందిట. అందువల్లనే ఇక్కడ ఆలయంలోని విగ్రహాలను కూడా అదే దిక్కులో ప్రతిష్ఠించారు. ఈ క్షేత్రాన్ని ఉపదేశ స్థలం కూడా అంటారు. ఎందుకంటే, ఈ ఆలయంలో గురువు పరమశివుడు కాగా, అఖిలాండేశ్వరి శిష్యురాలు. ఇతర శైవ క్షేత్రాలలోలా అందుకే ఈ ఆలయంలో తిరు కళ్యాణాన్ని నిర్వహించరు.

ఈ ఆలయంలో మరొక విశేషమేమిటంటే, శివుడిని అఖిలాండేశ్వరి ఆరాధించినందున, నేటికి కూడా మధ్యాహ్న వేళ అర్చకులు మహిళల వస్త్రధారణతో ఆ పరమశివుడికి, గోమాతకు అర్చన చేస్తారు. ఈ మధ్యాహ్న పూజ ఎంతగా ప్రాచుర్యం పొందిందంటే, భక్తులు ఆ వేళ కోసం వేచి ఉంటారు. అక్కడి లింగానికి అన్నాభిషేకం చేయడం, నల్ల ఆవుని పెంచడం ఈ ఆలయ సంప్రదాయాలలో ఒకటిగా మారింది.



## శంకరులవారి అనుబంధం

కైలాసవాసి అయిన ఆ శ్రీ పరమేశ్వరుడే 2,500 సంవత్సరాలకు ఈ భూమిపై శ్రీశంకర భగవత్పాదాచార్యులుగా దిగ్విజయ యాత్ర చేసి, శైవము, శాక్తము, వైష్ణవము, గాణాపత్యము, సౌరము, కౌమారము అనే ఆరు రకాల భక్తి మార్గాలను వేద ధర్మరీతిలో స్థాపించడంతో పాటుగా అద్వైత సిద్ధాంతాన్ని స్థిరపరిచి, కంచి దివ్యక్షేత్రంలో సర్వజ్ఞ పీఠారోహణం చేసి, శ్రీకామకోటి పీఠాన్ని స్థాపించి, అందులో ఆచార్యులుగా ఉన్నారు. లోక క్షేమాన్ని అననుగ్రహించిన ఆయన జగద్గురువుగా పేరుగాంచారు. లోక శ్రేయస్సు కోసం అనేక మహా క్షేత్రాలలో మహాయంత్ర ప్రతిష్ఠలను చేసి అనుగ్రహించారు. ఆయనకు గల బిరుదావళిలో–సకల భువన చక్ర ప్రతిష్ఠాపక శ్రీచక్ర ప్రతిష్ఠా విఖ్యాత– అనే విశేషణం ప్రాచీనమని స్పష్టమవుతుంది.

ఆ విధంగా శ్రీ ఆదిశంకరులు, తమ స్వహస్తాలతో శ్రీచక్రప్రతిష్ఠ చేసిన క్షేత్రాలలో తిరువానైక్కావల్ అనే గజారణ్య క్షేత్రం కూడా ప్రధానమైంది. తిరుచ్చిరాప్పళ్ళికి సమీపంలో, తిరువానైక్కావల్‌లో ఉభయ కావేరీ మధ్యలో స్వయంగా వేదమే శ్వేత జంబూ అంటే తెల్ల నేరేడు వృక్షంగా నిలిచి తపస్సు చేస్తోందని స్థలపురాణం చెబుతుంది. పంచభూత క్షేత్రాలలో జలక్షేత్రంగా కీర్తిగాంచిన తిరువనైక్కావల్‌లోని శ్రీజంబునాథ స్వామి ఆలయమున అఖిలాండేశ్వరి అన్న పేరుతో దేవి పార్వతి భక్తులను అనుగ్రహిస్తున్నారు.

ఆదిశంకర భగవత్పాదులు, దక్షిణ భారత విజయ యాత్రలో భాగంగా జంబుకేశ్వరానికి విచ్చేసినప్పుడు, లోకసంక్షేమం కోసం శ్రీ అమ్మవారి సన్నిధిలో తపస్సు చేసి అమ్మవారికి అభిముఖంగా శ్రీ మహాగణేశుని ప్రతిష్ఠించి, ఉగ్రరూపంగా ఉన్న అమ్మవారిని శాంతింపచేసి, శాంతరూపమైన శ్రీపరదేవత కళలను నవరత్నమయ మైన రెండు శ్రీచక్రాలలో ప్రతిష్ఠ చేశారు. ఆ రెండు శ్రీ చక్రాలకే – తాటంకం– అంటే కర్ణాభరణం అని పేరు. ఆ రెండు తాటంకాలను శ్రీ ఆచార్యులవారు అమ్మవారి చెవులకు అలంకరించారు. దానితో పాటుగా, తమ సౌందర్యలహరి అనే మహిమాన్వితమైన దేవి స్తోత్రములో 28వ శ్లోకములో అమృతాన్ని పొందేందుకు దేవతలు, రాక్షసులు పాలసముద్రాన్ని మథించినప్పుడు వచ్చిన కటు విషాన్ని లోకాన్ని రక్షించేందుకు తాగినా, శ్రీపరమేశ్వరుడు జీవించి ఉందేది అమ్మవారి తాటంక మహిమ వలనే – తవ జనని తాటంక మహిమా అని శ్రీ భగవత్పాదులు కీర్తించారు. శ్రీ అఖిలాండేశ్వరి అమ్మవారి శక్తి పూర్తిగా ఈ రెండు తాటంకాలలో ప్రతిష్ఠించి ఉన్నందున, ఈ తాటంకాలను తొడిగించి శ్రీ అమ్మవారికి నిత్య పూజ, ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.



ఈ తాటంక ప్రతిష్ఠ కారణంగా శ్రీ అదిశంకరాచార్య అష్టోత్తర శత అర్చన కూర్పులో, శ్రీ చక్రాత్మక తాటంక పోషితాంబా మనోరథాయ నమః అనే నామావళి కనిపిస్తుంది. శ్రీ అమ్మవారికి అభిముఖంగా ఉన్న శ్రీ వినాయకుని సమీపంలో శ్రీ ఆచార్యమూర్తి విగ్రహం తపోరూపంలో నేడు ఉన్నది.

ఆదిశంకర భగవత్పాదాచార్య స్వామివారు ఇక్కడ శ్రీచక్ర ప్రతిష్ఠ చేసినందుకు సాక్షిగా శ్రీఅఖిలాండేశ్వరి అమ్మవారి సన్నిధికి సమీపంలో శ్రీశంకర మఠమును, తోటను నిర్మాణం చేసిన చరిత్ర జంబుకేశ్వర దేవస్థానం వారు సమర్పించిన పాతపత్రాలలో ఉన్నది. దీనివలన శ్రీ కంచి కామకోటి పీఠం, శ్రీ శంకరాచార్య స్వామివారి శ్రీమఠం సంస్థాపన, శ్రీమఠం వారి జగద్గురు విద్యాస్థానాల పరంపరను తెలుసుకోవచ్చు.

ఇంతటి కీర్తిపొందిన శ్రీచక్ర తాటంకాలను జీర్ణోద్ధరణ చేయవలసినన కాలాల్లో శ్రీ జగద్గురు శంకర భగవత్పాదాచార్యుల అధిష్ఠానమైన శ్రీకంచి కామకోటి మూలామ్నాయ సర్వజ్ఞ పీఠంలో సింహాసనాధిష్ఠులైన శ్రీ కంచి కామకోటి పీఠాధిపతులైనన శ్రీశంకరాచార్య స్వాముల వారే స్వయంగా జంబుకేశ్వరానికి విజయం చేసి, తాటంకాలను జీర్ణోద్ధారణం చేసి, సంప్రదాయవిధిగా మళ్ళీ అమ్మవారి కర్ణములకు తామే స్వయంగా ప్రతిష్ఠ చేయటం పరంపరగా వస్తున్నది. శ్రీ ఆదిశంకారాచర్యులవారు మొదలుకొని వారిని అనుసరించి వచ్చిన శ్రీ కంచి కామకోటి పీఠాధిపతులు పలుమార్లు ఆయా కాలాల్లో తాటంకాలను జీర్ణోద్ధారము, ప్రతిష్ఠ చేశారు అనే విషయాన్ని చారిత్రిక ఆధారాలు మనకు వెల్లడిస్తున్నాయి.



## అమ్మవారి తాటంక జీర్ణోద్ధరణ, ప్రతిష్ఠ చేసిన కంచి పీఠాధిపతులు

1. శాలివాహన శకం 1686 అక్షయ సంవత్సరం, శాంకర సంవత్సరం 2195లో కంచి కామకోటి పీఠ 59వ ఆచార్యులైన శ్రీ భగవన్నామ బోధేంద్ర సరస్వతి శంకరాచార్య స్వాములు చేశారు.
2. శా.శ. 1757 ఈశ్వరనామ సంవత్సరం, శాంకర సంవత్సరం 2266లో 62వ ఆచార్యులైన శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామివారు.
3. శా.శ. 1846, ప్రభవనామ సంవత్సరం, శాంకర సంవత్సరం 2355లో 64వ ఆచార్యులైన శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతి శంకరాచార్యులవారు నాడు పూర్వాశ్రమంలో ఉన్న 65వ ఆచార్యులైన సుదర్శన మహాదేవేంద్ర సరస్వతి స్వాముల వారి కైంకర్యంలో.
4. శా.శ. 1908 ప్లవంగనామ సంవత్సరం, శాంకర సంవత్సరం 2416లో 68వ ఆచార్యులైన శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి శంకరాచార్యుల స్వామివారు.



5. శా.శ. 1923 రుధిరోద్గారి నామ సంవత్సరం, శాంకర సంవత్సరం 2432లో 68వ ఆచార్యులైనన శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతి శంకరాచార్య స్వాములవారు.
6. శా.శ. 1992 ప్రజాపతి నామ సంవత్సరం, శాంకర సంవత్సరం 2500లో 69వ ఆచార్యులైన శ్రీజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామి, శ్రీశంకర విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామి చేత ఎంతో వైభవంగా జరిగాయి.

## ఫిబ్రవరి 16న ఘనంగా జరిగిన జీర్ణోద్ధరణ కార్యక్రమం

వర్తమానంలో శ్రీ అఖిలాండేశ్వరి అమ్మవారి తాటంకములు కొద్దిగా జీర్ణమై ఉండటంతో దేవస్థానం నిర్వాహకులు, పూజారులు, స్థానికులు, పారంపర్య సంప్రదాయ పద్ధతిలోనే మూలామ్నాయ సర్వజ్ఞ శ్రీ కంచి కామకోటి పీఠాధిపతులైన జగద్గురు శ్రీశంకరాచార్య స్వాముల వద్దకు వచ్చి, వాటిని జీర్ణోద్ధారణం చేసి, తిరిగి అమ్మవారి కర్ణములకు ప్రతిష్ఠ చేయవలసిందిగా ప్రార్థించారు. వారి ప్రార్థనలను దయతో అంగీకరించి, తాటంక ప్రతిష్ఠార్థముగా శ్రీమత్ పరమహంస పరివ్రాజాకాచర్యవర్య శ్రీ కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వాములైన శ్రీ మహాసన్నిధానముల వారు విజయ యాత్రకు బలయలుదేరి, స్మరణాదరుణాచలే అని కీర్తిగాంచిన అరుణాచల క్షేత్రానికి విచ్చేసి, తదనంతరం తమ పూజా పరివారంతో జంబుకేశ్వర క్షేత్రానికి సకల సన్నాహాలతో విజయం చేసి స్వస్తి శ్రీక్రోధి నామ సంవత్సరం మాఘమాస 13.02.2025 తారీఖున శాంకర సంవత్సరం 2533 గురువారం నాడు కళాకర్షణం చేయించి, తాటంక జీర్ణోద్ధరణకు ఏర్పాట్లు చేశారు.

అనంతరం, శ్రీ క్రోధి నామ సంవత్సరం మాఘ మాసం- 16.02.2025వ తేదీ, శాంకర సంవత్సరం 2533 ఆదివారం, కృష్ణపక్ష చతుర్థి, హస్త నక్షత్రయుత ఆదిత్య హస్త అమృత సిద్ధయోగ పుణ్యకాల శుభదినాన ఉదయం 12.3/4 ఘడియలకుపై 13.3/4 ఘడియలలోపు అంటే 11.41 గంటలకు పైగా 12.00 గంటలలోపు శ్రీ అమ్మవారికి తాంటక ప్రతిష్ఠా మహోత్సవాన్ని శ్రీ కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీశంకరాచార్య స్వామి తమ స్వహస్తాలతో నిర్వహించారు. శ్రీ మహాసన్నిధానమువారు సూచించినట్టుగా ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని శ్రీ అమ్మవారిని దర్శించి, దివ్యానుగ్రహ పాత్రులయ్యారు.




# మాఘమాసంలో మహాకుంభ స్నాన విశిష్టత

## పురాణాలను అనుసరించి క్లుప్తంగా సంస్కృత శ్లోకాలు

### కుంభ్ ఏర్పడే కాల నిర్ణయం

మాఘమాసంలో సూర్యచంద్రులు మకరరాశిలో అధిష్టించి ఉండగా, గురువు మేషరాశి ప్రవేశ సమయంలో అమావాస్య తిథి కూడా సమ్మిళితమైతే ప్రయాగరాజ్‌లో కుంభ్‌గా నిర్ణయిస్తారు.

### వేదాలలో ప్రయాగ గొప్పతనము

ప్రయాగ గొప్పతనాన్ని ఋగ్వేదంలో విశదీకరించారు. గంగాయమునా నదుల సంగమ స్నానము, దానాదులు ఎవరైతే చేస్తారో వారికి ఉత్తమగతులు కలుగుతాయి. పిదప అక్కడ సోమేశ్వర భగవానునితో పాటు ఇంద్రభగవానుని ప్రార్థించి ఎవరైతే గంగా యమునా సరస్వతి పుణ్యనదుల సంగమంలో స్నానం ఆచరిస్తారో వారికి శాశ్వత కీర్తి లభిస్తుంది.

### మత్స్యపురాణములో ప్రయాగ గొప్పతనము

పాప ప్రక్షాళన, కీర్తి సంపాదన, బంధ విమోచన... ఓ యుధిష్ఠిరా... గయా నైమిశారణ్యము, గంగాసాగర్ వంటి కోట్ల పుణ్యతీర్థాలు, పుణ్యపర్వతాలు అనేకం ఉన్నాయి. ఇవన్నీ కూడా ప్రయాగ క్షేత్రంలో ఎల్లప్పుడూ ఉంటాయి. అందువల్ల సర్వైశ్వర్యాలు ప్రయాగలో ద్విగుణీకృతమవుతాయి. పాపాలు మూడు విధములు – తెలిసినవి, తెలియనివి, గతజన్మల సంచితకర్మలు. మాఘమాసంలో ప్రయాగలో స్నానమాచరిస్తే ఈ మూడు విధములైన పాపాలూ ప్రక్షాళన అవుతాయి. త్రివేణి సంగమ నీరు ఒక్కబొట్టు శరీరాన్ని తాకినా పాపాలన్నీ సమసిపోతాయి.

మాఘమాసంలో ప్రయాగదర్శనం లభించడమే దుర్లభం. ఎవరైతే మాఘమాసంలో త్రివేణిలో స్నానపానాలు గావిస్తారో వారు మహా పుణ్యాత్ములు. ఈ త్రివేణిసంగమ స్నానం అన్య ప్రదేశాల స్నానం కంటే లక్షరెట్లు మిన్న. గంగాయమునా సంగమ స్నానము వలన గత కల్పములలో చేసిన పాపాలు నిశిస్తాయి. అదీ మాఘమాసంలో లభ్యం మహాకష్టం. దేవతలు కూడా ఈ దివ్యమైన సమయం కోసం ఎదురు చూస్తుంటారు. సంగమ స్నానం భౌతిక సంసారాల నుండి విముక్తి కోసం. అందుకే త్రివేణిని – ముక్తి జనని– అని అంటారు.

ప్రయాగలో చేసిన పాపాలు కూడా మాఘస్నానం నశింపచేస్తుంది. మహాపుణ్యాత్ములకే పవిత్ర మాఘమాసంలో ప్రయాగ దర్శనం లభ్యం. వారికి పునర్జన్మ లేకుండా చేస్తుంది. త్రివేణిలో స్నానం ఈ మాయామయ సంసారాన్ని దాటించి వైకుంఠధామానికి చేరుస్తుంది. అశ్వమేధయజ్ఞాలు చేయడం కంటే త్రివేణిలో మాఘస్నానము ఎన్నోరెట్లు



యోగ్యమైనది.

### మాఘమాసంలో ప్రయాగ రాలేనివారికి పరిష్కారం

ఎవరి ఆలోచనలు నిరంతరం ప్రయాగపై ఉన్నాయో అట్టివారు వేరే ఏ తీర్థములో స్నానమాడినా మాఘమాసములో త్రివేణిలో స్నానమాచరించిన పుణ్యఫలితము ఉంటుంది. అనారోగ్యం వల్ల కాని, వేరే ఏ ఇతర కారణాల వల్ల కాని మాఘమాస ప్రయాగస్నానము చేయలేదో వారు పైవిధముగా స్నానమాచరించి అదే ఫలితము పొందవచ్చు.

### ప్రయాగలో నివాసము, స్నానము

ఒక పక్షం రోజులైనా, ఒక వారమైనా, మూడు రోజులైనా, కనీసం ఒక్కరోజైనా ప్రయాగలో మాఘస్నానం చేయటానికి గట్టి ప్రయత్నం చేయాలి. ప్రభాస్, గంగాసాగర్, కాశీలలోని సమాన స్నాన ఫలితం ఇక్కడ లభిస్తుంది. ఐదు రోజులు చేసే వారికి చంద్రకళలు వృద్ధి చెందినట్లుగా ఫలితము ఉంటుంది. యజ్ఞాలు, యోగాభ్యాసం, వందేళ్ళ ఉపవాసము చేయడంతో వచ్చే పుణ్యఫలితం ఇక్కడి మూడు రోజుల స్నానంతో సమానము. సూర్యగ్రహణం నాడు కురుక్షేత్రంలో చేసే సువర్ణదాన ఫలితాన్ని ప్రయాగలో త్రివేణిలో నిత్యస్నానము వల్ల సిద్ధిస్తుంది. కోటి గోవుల దానం, సువర్ణదానం వల్ల వచ్చే పుణ్యం కూడా ఈ నిత్యస్నానం వల్ల ప్రాప్తిస్తుంది.

### అందరికీ ప్రయాగ

జాతికుల, వర్ణాశ్రమ భేదాలు, ఆడవారు, మగవారు అనే తేడాలతో సంబంధం లేకుండా అందరికీ సమాన పుణ్యఫలితము ఈ మాఘమాస త్రివేణి స్నానం ఆచరించడం వల్ల లభిస్తుంది. శ్రీమహావిష్ణువు ఆరాధనకు ఎలా అందరూ అర్హులో, అలాగే అందరూ ఈ స్నానానికి అర్హులు. ఎవరూ అనర్హులు కారు. మత్స్య పురాణము ప్రకారం నిత్యస్మరణ వల్ల స్వర్గప్రాప్తి, అవసాన సమయాన స్మరణ వల్ల బ్రహ్మలోక ప్రాప్తి తథ్యం.

### స్కంద పురాణములో

ప్రయాగ స్మరణం, ప్రయాగ శ్రవణం పుణ్య ప్రాప్తికి, పాపాల నివృత్తికి కారకం. అలాంటిది ప్రయాగ త్రివేణి సంగమ స్నానం ఫలితం చెప్పాలా?

### ప్రయాగ శబ్దం నిరుక్తము ఆధారముగా

యజ్ఞయాగాదుల కంటే ఎక్కువ ఫలితాన్ని ఇస్తున్నందువల్ల - ప్రయాగ- అంటారు.

### స్కంద పురాణములో

ప్రయాగక్షేత్రంలో నివసిస్తే బ్రహ్మహత్యాది వంటి పాపాలు సైతం ప్రక్షాళన గావింపబడి రుద్రలోకం ప్రాప్తిస్తుంది. ఎవరైతే పురోభివృద్ధి కోరుకుంటారో వారు ప్రయాగను దర్శించి పితృకార్యాలు నిర్వహించాలి. సద్గతుల కోసం భగవానుని ప్రార్థించాలి.

### మాఘసప్తమి స్నానం

మాఘసప్తమి - రథసప్తమి- నాడు ఎవరైతే ప్రయాగ త్రివేణి సంగమ స్నానం ఉదయాన్నే ఆచరిస్తారో, వారికి కోటి సూర్యగ్రహణ స్నానాల ఫలితం ప్రాప్తిస్తుంది.



# ప్రభుత్వ నియంత్రణ నుంచి ఆలయాలను విముక్తం చేయాలని పిలుపునిచ్చిన కంచి పీఠాధిపతులు శ్రీవిజయేంద్ర సరస్వతి స్వామి

## ఆలయాలలో పిపిపి – ప్రజలు, పురోహితులు, పూజారుల నమూనాను ప్రతిపాదించిన కంచి పీఠాధిపతులు శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామివారు

గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః
గురుః సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః

శ్రుతి స్మృతి పురాణానాం ఆలయం కరుణాలయం
నమామి భగవత్పాద శంకరం లోకశంకరం

అపారకరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీచంద్రశేఖరగురుం ప్రణమామి ముదాన్వహం

సదాశివ సమారంభం శంకరాచార్య మధ్యమాం
అస్మదాచార్య పర్యంతాం వందే గురు పరంపరాం



భారతదేశవ్యాప్తంగా ఉన్న ఆలయాలను, వాటి ఆస్తులను ప్రభుత్వ నియంత్రణ నుంచి తప్పించి ఆలయ ధర్మకర్తలకు అప్పగించాలని కంచి శంకరాచార్య శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామి గత ఆదివారం ప్రతిపాదించారు.


ప్రయాగరాజ్‌లో జరుగుతున్న కుంభమేళాలో పవిత్ర స్నానం ఆచరించేందుకు, సెక్టార్ 20లో గల కంచి శంకరమఠ శిబిరంలో ఒక కార్యక్రమానికి హాజరయ్యేందుకు శ్రీ విజయేంద్ర సరస్వతీ స్వామివారు విచ్చేసిన సందర్భంగా ఆంగ్లదినపత్రిక, టైమ్స్ ఆఫ్ ఇండియాతో మాట్లాడారు.

ప్రయాగరాజ్‌లో జరిగిన ప్రతి కుంభమేళా ఒక డిమాండ్‌ను లేవనెత్తిందని, 2013లో రామమందిరం కోసం లేవనెత్తిన ప్రతిపాదన అటువంటిదేనని– కాలక్రమంలో ప్రతి అంశమూ ఫలసిద్ధి పొందిందని ఉద్ఘాటించారు. మహాకుంభమేళా 2025లో అన్ని దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తం చేయాలనే ప్రతిపాదన ప్రస్తుతం ప్రతిధ్వనిస్తున్నదని, శ్రీ కంచి కామకోటి పీఠం 70వ పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి అన్నారు.

మొదటగా అన్ని ఆలయాలను పునరిద్ధరించాలని, రెండవది ఈ ఆలయాలలో సరైన పూజలు నిర్వహించేలా చూడాలని, మూడవది, ఆలయాలకి వచ్చిన దక్షిణ లేదా ఆదాయం అంతా ఆలయాలకే దక్కాలని తాను డిమాండ్ చేస్తున్నానని స్వామివారు అన్నారు. కన్యాకుమారి నుంచి కాశ్మీరం వరకూ ఉన్న ఆలయాలను, వాటి భూములు, ఆస్తులు, ఇతర కమతాలు ఆలయానికి చెందిన ఆస్తి మాత్రమే కావాలని తాను డిమాండ్ చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

ఈ ఆలయాలకు వచ్చే ఆదాయాన్ని సనాతన ధర్మాన్ని ప్రోత్సహించేందుకు, వేదాలలో ప్రావీణ్యం ఉన్న విద్యార్థులకు శిక్షణను ఇచ్చేందుకు, గురుకులాల స్థాపనకు, గోశాలలను ప్రారంభించేందుకు, శాస్త్రీయ సంగీతానికి తోడ్పాటునిచ్చి ప్రోత్సహించేందుకు ఉపయోగించాలని ఆయన సూచించారు.

ధార్మిక వ్యవస్థలో పిపిపి పద్ధతి పాటించాలని – ప్రజ, పురోహిత్, పూజారి వ్యవస్థ–ఉండాలని ఆయన అన్నారు. ఈ 'త్రివేణి' కేవలం ఆలయాలనే కాక సనాతన ధర్మాన్ని కూడా తప్పనిసరిగా ఉద్ధరిస్తుందని ఆయన చెప్పారు. ప్రతి పంచాయతీలోనూ ఒక పూజారి ఉండాలని, ప్రతి గ్రామంలోనూ తిరుపతి వంటి ఆలయం ఉండాలని ఆయన





పేర్కొన్నారు.

మతపరమైన ఆచారాలకు నేటి యువత దూరమవుతున్నారా అని ప్రశ్నించినప్పుడు, యువతలో మత విశ్వాసం లోపిస్తోందన్న భావన నిజం కాదని, తిలకధారణతో, పూర్తి భక్తి భావంతో పెద్ద సంఖ్యలో యువతీ, యువకులు మహాకుంభ మేళాకి రావడాన్ని తాను చూశానని, ఆయన చెప్పారు. ఈ దేశంలో ఇంకా విశ్వాసం మిగిలే ఉందని, లోపించింది సంస్థ, వ్యవస్థ (నియమ నిబంధనలు) మాత్రమేనని ఆయన వివరించారు.

దేశం, కుటుంబాలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయని అంగీకరిస్తూనే, మార్పు అనేది కుటుంబాలలోనే ప్రారంభం కావాలని నొక్కి చెప్పారు. సనాతన ధర్మాన్ని పరిరక్షించడం ద్వారా మనం మన ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోగలమన్నారు. ముఖ్యంగా, దేశం సురక్షితంగా ఉన్నప్పుడు మాత్రమే ప్రపంచంలో శాంతి నెలకొంటుందని ఆయన చెప్పారు.

కనుక, భారతదేశం సురక్షితంగా ఉండాలని, దేశ రక్షణ కోసం సనాతన ధర్మ ప్రచారం ప్రధానమని అన్నారు. మన పూర్వీకులు ఆచారాలు, సంప్రదాయాల ద్వారా అందించిన విలువలు పోరాటం చేసేందుకు కాదని, దేశాన్ని బలోపేతం చేయడం కోసమని స్వామి చెప్పారు.

సమాజంలోని ప్రతి రంగంలోనూ యువతను భాగస్వాములను చేయాలని సూచిస్తూ, ప్రభుత్వం ఆ యువజన మహాకుంభ్‌కు సంసిద్ధం కావడం ప్రారంభించాలని అన్నారు. మహాకుంభ మేళాకు సంబంధించిన అన్ని విజయాలను, నేర్చుకున్న పాఠాలను సరైన రీతిలో గ్రంథస్థం చేయాలని స్వామి సూచించారు. కుంభ మేళ వంటి కార్యక్రమాలనును విజయవంతంగా నిర్వహించేందుకు ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం చేసిన ప్రయోగాలను మాత్రమే కాక, బీహార్, మధ్య ప్రదేశ్ సహా పొరుగు రాష్ట్రాలు ఏర్పాట్ల కోసం అందించిన తోడ్పాటును కూడా గ్రంథస్థం చేసే సమయంలో పరిగణనలోకి తీసుకోవాలని శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామివారు చెప్పారు.

ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని ప్రభుత్వం చేసిన కృషిని కొనియాడుతూ, ఇంతకు ముందు ప్రయాగరాజ్‌లో శంకర విమాన మండపం అనే ఆలయం ఉండేదని, ప్రయాగరాజ్ విమానాశ్రయం విమానాలకు మండపం అయిందని స్వామివారు చమత్కరించారు.




# సనాతన ధర్మానికి ఎప్పుడు సవాలు ఎదురైనా అండగా నిలిచిన శ్రీకంచి కామకోటి పీఠం - యోగి ఆదిత్యనాథ్

సనాతన ధర్మానికి ఎప్పుడు సవాళ్లు ఎదురైనా, శ్రీ ఆదిశంకరులు స్థాపించిన పావన పీఠమైన శ్రీ కంచి కామకోటి పీఠం సనాతన ధర్మాన్ని సమర్థిస్తూ, పరిరక్షించేందుకు ముందు వరుసలో నిలిచి, తిరుగులేని అండను ఇచ్చిందని, ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కొనియాడారు.

ప్రయాగరాజ్‌లో జరుగుతున్న కుంభమేళాలో పవిత్ర స్నానం ఆచరించేందుకు శ్రీ విజయేంద్ర సరస్వతీ స్వామి విచ్చేసిన సందర్భంగా ఆయనకు ఆహ్వానం పలికి, సెక్టార్ 20లో గల శిబిరంలో జరిగిన ఒక కార్యక్రమంలో స్వామివారితో కలిసి యోగి ఆదిత్యనాథ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, సనాతన ధర్మాన్ని ప్రాభవంతో తిరిగి తీసుకువచ్చిన అయోధ్యలో శ్రీరామజన్మభూమిని తిరిగి సాధించి, బాలక్ రాముని విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించడానికి ఎంతో ఔదార్యంతో మార్గాన్ని సుగమం చేసినందుకు నిరంతరం స్మరించుకునే, ఆరాధించే, గౌరవించే గురుదేవులు పూజ్యశ్రీ జయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామికి మనం శాశ్వతంగా రుణపడి ఉన్నామని, యోగి ఆదిత్యనాథ్ అన్నారు.

సనాతన ధర్మం కేవలం భారతదేశంలోనే కాక, ప్రపంచంలో ఏ మూలన సమస్యలను ఎదుర్కొన్నా, ఇద్దరు శంకరాచార్యులు దానికి స్పందించేవారు. పూజ్యశ్రీ జయేంద్ర సరస్వతి స్వామి, పూజ్యశ్రీ



విజయేంద్ర సరస్వతి స్వామి కలిసి నేపాల్‌ను, ఇతర చోట్లను దర్శించి, జనజాగరణ కోసం ఎక్కువ కాలం అక్కడే ఉండటాన్ని, సవాళ్లతో కూడిన సమస్యలను ప్రత్యక్షంగా ఎదుర్కొని, అన్ని రకాల తోడ్పాటుతో ధర్మాన్ని సమర్థించడాన్ని తాను చూశానని యోగి అన్నారు.

సనాతన ధర్మం ప్రపంచంలో ఎక్కడ సంక్షుభితమైనా శ్రీ కంచి కామకోటి పీఠానికి చెందిన శంకరాచార్యులు దానిని మరింత బలంగా, శక్తిమంతంగా నిలబెట్టడానికి తమ పూర్తి మద్దతను, ఆశీస్సులను ఖచ్చితంగా అందిస్తారని యోగి అన్నారు. మహా కుంభమేళాలో ఈ రోజు మనందరికీ ఎంతో విశేషమైనదని, ఉత్తర ప్రదేశ్, చుట్టపక్కల ప్రాంతాల వారందరికీ ఇది ఎంతో ప్రత్యేకమైనదని యోగి అన్నారు.





# సౌరాష్ట్రే సోమనాథంచ...

'సౌరాష్ట్రే సోమనాథంచ...' అని చెప్పబడే ద్వాదశ జ్యోతిర్లింగాలలో ప్రప్రథమైనది గుజరాత్ సౌరాష్ట్రలోని 'సోమనాథ 'జ్యోతిర్లింగ క్షేత్రం. దక్షప్రజాపతికి జామాత అయిన చంద్రునిచే ప్రతిష్ఠింపబడినది అని మన ఇతిహాసాలు చెప్తున్నాయి. ఈ ఆలయానికి ఒక విస్తారమైన చరిత్ర వుంది. ఇప్పటి చరిత్ర ఆధారంగా క్రీస్తు శకమునకు ఎన్నో వందల సంవత్సరాల క్రితం నుండీ ఈ ఆలయం మనుగడలో వుంది.

ముష్కరులైన తురుష్కుల వరుస దండయాత్రలలో అపార సంపదతో వెలిగిపోతున్న ఆలయం దోచుకోబడింది. అలా ఎన్నో మార్లు విదేశీ దురాక్రమణలకు గురై శిథిలావస్థలో వున్న ఆలయాన్ని పలుమార్లు మన హైందవ రాజులు పునర్నిర్మించారు, వారిలో చాళుక్య రాజులు ప్రథములు. మన దేశ స్వాతంత్రం తరువాత సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి చొరవతో 1951లో నూతన ఆలయాన్ని నిర్మించారు. అప్పటి రాష్ట్రపతి డా. రాజేంద్రప్రసాద్‌గారి ద్వారా ప్రారంభింపబడింది.

ఇక్కడి శివలింగము ఒక విశిష్టత కలిగి వుండేది. ఆలయ మధ్యభాగంలో ఎటువంటి ఆధారమూ లేకుండా గాలిలో తేలినట్టుగా నిలిచి వుండడం – ఒక ప్రత్యేక ఆకర్షణ. మన పూర్వీకుల శాస్త్ర పరిజ్ఞానానికి ఇదొక నిదర్శనము. కానీ ఈ దోపిడీదారుల విధ్వంసాల వల్ల ఆ శివలింగము ముక్కలు ముక్కలుగా అయిపోయింది. సుమారు వేయి సంవత్సరాల పూర్వము అలా భిన్నమైన శివలింగం ముక్కలు కొన్నింటిని అప్పటి విజ్ఞులు గోప్యంగా దాచి ఉంచారు. తదనంతరపు తరము వారు ఆ ముక్కలలో ఏదో దివ్య ఆకర్షణ శక్తి వుందని గ్రహించి, వాటిని గుండ్రని ఆకారములలో (సాలిగ్రామాలలాగా) పొందుపరిచారు. కాలక్రమేణ ఆ శివలింగ భాగాలు ఉత్తరాఖండ్ లోని యతి శ్రీ ప్రణవేంద్ర సరస్వతి గారి వద్దకు చేరి నిత్య పూజలు అందుకుంటూ వారి సంరక్షణలో ఉండేవి

తర్వాత కాలంలో శ్రీ ప్రణవేంద్ర సరస్వతి స్వామి ఆ శివలింగాలను దక్షిణభారత దేశములోని చెన్నైలో నివసిస్తున్న ఒక వైదిక కుటుంబానికి ఇచ్చి, వాటిని నిరంతర సంరక్షణలో వుంచుకుని నిత్యా పూజలు నిర్వర్తించాలని ఆదేశించారు.

ఆ కుటుంబీకులైన శ్రీ సీతారామ శాస్త్రి గారు తరతరాలుగా పూజలందుకుంటున్న ఆ శివలింగ ఖండాల విశిష్టతను ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు శ్రీ రవిశంకర్ గారిని కలిసి తెలియ చేశారు. వీరు అరుణాచలంలో బస చేస్తున్న కంచిపీఠ జగద్గురువులు శ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి స్వామి వారిని సందర్శించినపుడు ఈ శివలింగ ఖండాల ప్రస్తావన రావడంతో, వీటిని ద్వాదశ జ్యోతిర్లింగాలలో పూజలు కావించి సోమనాథ క్షేత్రంలో ప్రతిష్ట చేసే విధంగా కార్యక్రమాన్ని రూపొందించే బాధ్యతను స్వీకరించమని స్వామివారు కోరారు.



# సన్మార్గంలో ఉండేందుకే గురుభక్తి, గురుకులవాసం

## శ్రీచంద్రశేఖరేంద్రస్వామివారి జయంతి సందర్భంగా శ్రీవిజయేంద్ర సరస్వతి ఉద్బోధ

గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః
గురుః సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః

శ్రుతి స్మృతి పురాణానాం ఆలయం కరుణాలయం
నమామి భగవత్పాద శంకరం లోకశంకరం

అపారకరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీచంద్రశేఖరగురుం ప్రణమామి ముదాన్వహం


సదాశివ సమారంభం శంకరాచార్య మధ్యమాం
అస్మదాచార్య పర్యంతాం వందే గురు పరంపరాం

కంచి మహాస్వామివారి జయంతి ఉత్సవాన్ని చాంద్రమానం ప్రకారం భక్తులందరూ అనేక చోట్ల అత్యంత గురుభక్తితో పూజలు, పారాయణలతో జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గురుభక్తి, గురుకులవాసం, ఉపదేశం అనేవి మన భారతదేశంలో మానవ జీవితంలో మనుషులు మంచిదారిలో ఉండటానికి, సద్గతి, పుణ్యము, పురుషార్థము పొందడానికి ఉద్దేశించినవి. ఇది మన దేశంలో ఉన్న అనాది పరంపర. కృష్ణపరమాత్మ సాందీపుని ఆశ్రమానికి వెళ్ళి, గురుశుశ్రూష చేసి అందరితో కలిసి విద్యాభ్యాసం చేసి, ఆయనతో చదువుకున్న సుధామకు- కుచేలుడు- ఒక సందర్భంలో విశేష అనుగ్రహం ప్రసాదించడం మనం తెలుసుకున్నాం. ఆ గురుకులవాసం చేత విద్యలో నైపుణ్యము, జీవితంలో పుణ్యము, ఈ రెండూ పొందేటట్లుగా ఒక క్రమశిక్షణ, సేవాభావము, వినయ విధేయతలు, ఆదరణభావము ఏర్పడతాయి.

మాతృదేవో భవ పితృదేవో భవ
ఆచార్యదేవో భవ అతిథిదేవో భవ

అనే ఉపనిషత్తులోని ఆత్మగుణాలు, సద్గుణస్వభావాలు

గురుకుల వాసం చేత కలుగుతాయి. భావము, స్వభావము, ఏ భావముతో, సంకల్పంతో మనం పెరగాలి, ఏ ఉద్దేశ్యము మన జీవిత లక్ష్యంగా పెట్టుకోవాలి అనే ఒక ఉన్నత తత్త్వము గురుకులవాసం చేత కలుగుతుంది. ఈ గురుకులవాసం చేత సమాజానికి ఉపయోగపడే నేతలు, గొప్ప ధర్మప్రచారకులు తయారయ్యారు. మన భారతీయ సమాజానికి ఆదర్శంగా ఉండి, ఆదేశాలిచ్చి, దారి చూపించేది వేదము, ఉపనిషత్తులు, శాస్త్రములు. వీటి భావార్థాన్ని సరళంగా, సహజంగా, ప్రేమతో, ఉదారమైన, విశాలమైన దృక్పథంతో మనకు అందించినవారు శంకరభగత్పాదా చార్యులు. వారు చేసిన అద్వైతతత్త్వ ప్రచారము, షణ్మతస్థాపనము, సేవాభావము, వీటన్నింటినీ ఈ శతాబ్దంలో మన కంచి మహాస్వామివారు అందించారు. ఆయన



నడిచేదేవుడిగా మన మధ్యలో నడయాడి, పర్యటించి, ఉపదేశించి, చాతుర్మాస్య వ్రతాలు నిర్వహించారు. వారి మౌనము, ఉపదేశము, సంచారము, శోధన, శాస్త్రాలన్నింటినీ పరిశీలించి, ప్రజలకు ఏ సందేశాలు ఇస్తే వారికి ఐహిక, ఆముష్మిక శ్రేయస్సు కలుగుతుందో వాటిని ఆచరింపచేసేవారు.

స్వయంకృషితో, సదాపరోపకారా చిత్తవృత్తితో ఇంత అద్భుతమైన సనాతన హైందవ ధర్మాన్ని దేశవిదేశాలలో ఉన్న మానవాళికి – ఇతర నమ్మకాలతో ఉన్న వాళ్లకి కూడా– ధర్మము, వేదాంతతత్త్వము ఎంత అవసరమో, ఎంత ఉపయోగపడుతుందో అనే విషయాన్ని వారి ఆధ్యాత్మికశక్తితో, సాత్వికహృదయంతో, సరళంగా ప్రజలందరికీ అందిస్తూ, సమాజంలో ఉన్నా, సమాజం నుండి దూరంగా నిరాడంబరంగా ఉండి, సమాజంలో ఆర్థిక, సామాజిక, ధార్మిక వికాసం కోసం శ్రమించారు. ముఖ్యంగా సనాతనధర్మంలో ఉండే వైజ్ఞానిక దృక్పథం శాస్త్రజ్ఞులు కూడా గుర్తించాలని ప్రయత్నం చేశారు. భారతీయులకి, మొత్తం ప్రపంచ జనులకు కూడా ధర్మం పట్ల ఆసక్తి కలగాలనీ, ధర్మమనేది మనిషి జీవితం నుండి విడిగా లేకుండా, మనిషి జీవితంలో భాగం కావాలని ఉపదేశించారు. ధర్మాన్ని ఆచరిస్తూ, నిత్యపూజలు నిర్వహించుకుంటూ జీవించాలి. వేద సంరక్షణ చేసి, వేదము, శాస్త్రము చదువుకున్న పండితులను తయారు చేయాలి. మన పురాణాలు, శాస్త్రాలు ప్రచారం చేయాలి. పాత గుడిగోపురాలను జీర్ణోద్ధరణ చేసి, కుంభాభిషేకాలు చేసి, నిత్యపూజలకు ఏర్పాటు చెయ్యాలి. తద్వారా గ్రామక్షేమం, లోకక్షేమం కలుగుతుంది. పరార్థపూజ గుళ్ళో జరుగుతుంది. ఆత్మార్థపూజ ఇంట్లో చేసుకోవాలి. శివపూజ, పంచాయతనం, జపం పారాయణలు, ధ్యానం ఏదోక మార్గంలో ఆచరించాలి. శాస్త్రాన్ని అర్థం చేసుకోవాలి. కర్మమార్గాన్ని ఒదిలి పెట్టకుండా, కర్మణ్యేవాధికారస్తే మాఫలేషు కదాచనా, అని భక్తిశ్రద్ధలతో, ఫలాసక్తి లేకుండా ఆచరించాలి. ఇటువంటి అనేక సందేశాలను వారి ఉపన్యాసాల ద్వారా ప్రచారం చేశారు. ఉపన్యాసాల ద్వారా విశేష అనుగ్రహం ద్వారా కొన్ని, వారి సంచారం ద్వారా మరికొన్నింటిని తెలియపరిచారు. అధికారులకు, ప్రముఖులకు మార్గదర్శనం చేసి, ఈ దేశ పరిపాలనలో ఆగమములు, శాస్త్రములు, సంస్కృతము, ప్రాంతీయ భాషల అవసరము, ఆవశ్యకతను సూచించారు. ప్రాంతీయ భాషలో ఉండే సందేశాలను, తిరుప్పావై, తిరువంబావై వంటి శతకాలను పిల్లలకు నేర్పిస్తూ, ప్రోత్సహించడం కోసం వారికి వెండి, బంగారు కాసులను ఇవ్వడం, రామనామ లేఖనం చేయించాలి.

అలాగే, మన దేశానికి, విదేశాలకు సాంస్కృతిక సంబంధాలు



ఎలా ఉన్నాయి, ఈ దేశంలోని గొప్ప విషయాలు ఇండోచైనా వంటి ఇతర దేశాలకు వెళ్ళాయి. ఈ దేశ గౌరవం, ప్రాశస్త్యము, వ్యక్తిగతమైన మానవతా విలువలు, ధర్మశాస్త్రం చెప్పిన నిత్యకర్మానుష్ఠానము అన్నింటికీ ఒక సమన్వయమైన, శాస్త్రీయమైన, సాత్వికమైన ఒక ప్రచార కార్యక్రమాన్ని తయారు చేస్తూ ఎంత పెద్ద వయస్సు వచ్చినా ధర్మాచరణలో పట్టుగా ఉంటూ, వారి అనుష్ఠానము, మానసికపూజ, సంవత్సరాల నుండీ చంద్రమౌళీశ్వరస్వామి పూజ, ఎండ,చలి, గాలి సహా అన్ని రకాల వాతావరణలలో పాదయాత్రలలో, పర్యటనలలో, ప్రజల, దేశ, సమాజ క్షేమం కోసం ఋషివంటివారి కృషి అనితరసాధ్యమైనది, ఎనలేనిది.

**-పరోపకారార్థం ఇదం శరీరం-** అన్నట్లు విద్యాపరంగా, ఉపాసనాపరంగా, ఉపకారాలందించడం ద్వారా ప్రజలకు, విద్యావంతులకు, అవిద్యావంతులకు, ప్రభువులకు అందరికీ మనస్సులో భక్తి, సేవాభావం, వినమ్రత, ఆత్మవిశ్వాసం పెంపొందించే విధంగా అనేక కార్యక్రమాలు నిర్వహింపచేశారు. ఇదంతా ఈ శతాబ్దంలో ప్రజలు చేసుకున్న భాగ్యము. ఇలాంటి అవతారాల గురించి మనం పురాణాలలో చదువుతాము. శంకరాచార్యులవారి గురించి విన్నాము. నడిచేదేవునిగా మహాస్వామివారిని దర్శించుకునే గొప్ప అదృష్టం మనకు కలిగింది. ఈ రోజు గురుభక్తితో మంచి కార్యక్రమాలు చేస్తూ, తద్వారా వారి ఆశీర్వచనం పొంది, ప్రజలలో ధార్మిక చైతన్యం, స్ఫూర్తి, ప్రేరణ, శ్రద్ధ కలిగి ఇతోధికంగా శ్రేయస్సు పొందడానికి అందరూ కూడా ధ్యానము, స్మరణము, పూజలు, పారాయణలు చేయాలి. – గుకార అంధకారస్యాత్ రుకార తన్నిరోధక:– అంధకార నివృత్తి జరిగి, ఆరోగ్యము, ఆర్థికోన్నతి, భద్రమైన పర్యావరణము వారి ఆశీర్వచనంతో చేకూరాలి.

*చంద్రశేఖర చంద్రశేఖర చంద్రశేఖర పాహిమాం*

*చంద్రశేఖర చంద్రశేఖర చంద్రశేఖర రక్షమాం* అని వారిని స్మరిస్తూ

**జయజయ శంకర హరహర శంకర**

# శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారి విజయయాత్ర విశేషాలు












**08 ఫిబ్రవరి 2025న** జరిగిన శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ విశ్వమహావిద్యాలయము ఏనాతుర్, కాంచీపురంలో 28వ స్నాతకోత్సవాన్ని పూజ్యశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామివారు అనుగ్రహ భాషణంతో స్నాతక విద్యార్థులను ఆశీర్వదించి అనుగ్రహించారు. ఈ సందర్భానికి AICTE అధ్యక్షులు శ్రీ టి.జి. సీతారామన్ గారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు.









**25 ఫిబ్రవరిన** పూజ్యశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారి జయంతి మహోత్సవం తిరువవానైకావిల్ కంచి మఠంలో అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి తిరుపతి వేంకటేశ్వర స్వామి, కంచి కామాక్షి దేవి, అఖిలాండేశ్వరి దేవి మొదలగు ముఖ్య దేవాలయాల నుండి ప్రసాదాలు అందించారు. హోమాలు, వటు పూజ, కన్యా పూజ, ఇత్యాది కార్యక్రమాలు శ్రీ మఠం వారు నిర్వహించారు.



**ఫిబ్రవరి 26న** తిరువానైకావిల్ కంచి మఠంలో శివరాత్రి పూజలు, భజనలు, శివ సంకీర్తన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు శ్రీ మహా త్రిపుర సుందరీ సమేత శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి వారి అభిషేక, అర్చన పూజలు రాత్రంతా చేశారు.





మార్చి 11న కాంచీపురం శ్రీమఠంలో పూజ్యశ్రీ జయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామివారి 7వ వార్షిక ఆరాధన ఉత్సవం ఘనంగా జరిగింది.





श्रीचन्द्रशेखरेन्द्रसरस्वतीविश्वमहाविद्यालयः

# Sri Chandrasekharendra Saraswathi Viswa Mahavidyalaya (SCSVMV)

Deemed to be University | Accredited by NAAC with 'A' Grade
Sponsored and run by Sri Kanchi Kamakoti Peetam Charitable Trust



ACCREDITED WITH GRADE A NAAC

# ADMISSIONS OPEN!
## 2025 - 2026

### UG Programmes

**B.E.** (Full Time) CSE / Civil / ECE / EEE / Mechanical
(Part Time) Civil / ECE / EEE / Mechanical
(Approved by AICTE)

- **B.A.M.S.** Bachelor of Ayurvedic Medicine and Surgery (Approved by NCISM)
- **B.Ed** Bachelor of Education (Approved by NCTE)
- **B.Sc.** Cyber Security / Data Science / Computer Science / Computer Science with Cognitive Systems / Chemistry / Physics / Mathematics (w/ Computer application)
- **B.C.A.** Bachelor of Computer Applications
- **B.Com.** General / Computer Application
- **B.B.A.** Bachelor of Business Administration
- **B.A.** Sanskrit * / English

### PG Programmes

- **M.B.A.** Master of Business Administration
- **M.C.A.** Master of Computer Applications
- **M.E.** Power System / CSE / Engineering Design / Embedded System Technologies (Full-time / Part-time)
- **M.S. / M.D.** Ayurveda (Approved by NCISM)
- **M.A.** Sahitya / Nyaya / Vyakarana / Advaita Vedanta
- **M.Sc.** Physics / Chemistry / Mathematics
- **M.A.** Sanskrit *

### Allied Health Sciences

- **B.P.T.** Bachelor of Physiotherapy
- **B.Optom.** Bachelor of Optometry
- **B.Sc.** Cardiac Technology / Radiology and Imaging Technology / Dialysis Technology

Upto 75% waiver in Tuition Fee* under merit scholarship scheme
*T&C Apply

### B.E. Hons. / Minor Degrees

- Artificial Intelligence and Machine Learning
- Cyber Security
- Data Science
- Electric Vehicles
- Internet of Things (IoT)
- Sensor Technology
- 3D Printing
- Robotics
- Microgrid Technology
- Electrical & Computer science
- Universal Human Values
- VLSI Design
- 5G communication systems
- Image Processing and Computer Vision
- Drone Technology

WiFi Enabled Campus
Wellness Center
Vibrant Sports & Culturals
Accessible Gym

**Excellent Placement Facilities!**


kanchiuniv.ac.in
**Apply Online!**

* ODL (Open Distance Learning) is also available

Contact: +91 96290 32323 | +91 96290 01144 | +91 80980 01630 (Ayurveda)

Campus Address: Sri Jayendra Saraswathi Street, Enathur, Kanchipuram, Tamil Nadu, India - 631561

# శ్రీ కామకోటివాణి
## ప్రత్యేక సంచిక




వెల - 250 రూపాయలు
(Postage 50 రూపాయలు అదనం)

ప్రత్యేక సంచిక కోసము
సంప్రదించవలసిన వివరాలు:

**శ్రీ కంచి కామకోటి క్యాంపు**

Email ID - srikamakotivaani@gmail.com



## For Sri Kamakoti Vaani Subscription



**Bank Details:**

**Account Name:**
Sri Kamakoti Touryatrika Trust SKV
Bank: ICICI Bank
Account No.: 440705000345
IFSC Code: ICIC0004407
UPI ID – SRIKAMAKOTIVAANI@icici

**Subscription**

₹ 480 INR (India)
₹ 5000 INR
(Lifetime, for 10 years)

e-mail id -
srikamakotivaani@gmail.com

Scan me!

Sri Kamakoti Vaani subscription payment gateway.

Donors may please contact:
**Prayaga Srinivas : 800 800 1335**

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA

SRI CHANDRAMOULEESWARAYA NAMAHA



SHRI KANCHI KAMAKOTI PEETAM
JAGADGURU SHANKARACHARYA SWAMIGAL
SHRIMATAM SAMSTHANAM
1, SALAI STREET, KANCHIPURAM, TAMILNADU - 631502 INDIA

www.kamakoti.org

fb.me/srikamakoti

youtube.com/kanchimath

twitter.com/kanchimatham

instagram.com/kanchimutt

koo @kamakoti

Koo

www.kamakoti.tv

www.kanchimuttseva.org

ESEVA PORTAL

for Online Puja Bookings & Contributions

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA

# Sri Akilandeshwari Taatanka Pratishta Mahotsavam
## 16 - 02 - 2025











శ్రీ అఖిలాండేశ్వరి రక్షమాం ఆగమ సంప్రదాయ నిపుణే,
నిఖిలలోక నిత్యాత్మికే విమలే, నిర్మలే శ్యామలే సకల కళే,
లంబోదర గురుగుహ పూజితే, లంబాలకోద్భాసితే హసితే,
వాగ్దేవతారాధితే వరదే, వరశైలరాజసుతే శారదే,
జంభారి సంభావితే జనార్దన నుతే, ద్విజావంతి రాగ నుతే, జల్లీ మద్దళ
ఝరర వాద్య నాద ముదితే, జ్ఞానప్రదే

Hara Hara Shankara Jaya Jaya Shankara Hara Hara Shankara Jaya Jaya Shankara

Hara Hara Shankara Jaya Jaya Shankara Hara Hara Shankara Jaya Jaya Shankara Hara Hara Shankara